
## దంతెవాడలో ఎన్‌కౌంటర్
ముగ్గురు మావోయిస్టులు హతం



4లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | మంగళవారం | 26 -12 - 2023 | సంపుటి: 1 | సంచిక : 221 | పేజీలు : 4 | వెల : 5/-

## దళిత ప్రధాని !

- లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రయోగం
- ఇండియా కూటమి అంగీకరించేనా?
- హస్తం పార్టీ ఎత్తుగడ ఫలించేనా?
- రాజకీయ శ్రేణుల్లో విస్తృతంగా చర్చ

**న్యూఢిల్లీ, ప్రభాతసూర్యుడు :** గత ఏడాది కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా రాజ్యసభలో ప్రతిపక్ష నేత ఎం.మల్లికార్జున్ ఖర్గే ఎన్నికయ్యారు. 24 ఏండ్ల తర్వాత నెహ్రూ-గాంధీ కుటుంబానికి సంబంధం లేని బయటి వ్యక్తికి ఈ పదవి లభించిందని కొందరు సంబురపడ్డారు. బాబూ జగ్జీవన్‌రామ్ తర్వాత 52 ఏండ్లకు మరోసారి దళిత వ్యక్తిని అధ్యక్ష పీఠంపై కూర్చోబెట్టిన కాంగ్రెస్ తాజాగా ప్రధాని అభ్యర్థిగా ఖర్గే పేరును జపిస్తున్నది. ఎన్నికల వేళ 'దళిత ప్రధాని' కార్డును కాంగ్రెస్ తెరపైకి

మిగతా 2వ పేజీలో...

## కాంగ్రెస్ కొంచెమే..!

- సోషల్‌మీడియా వాడకం తక్కువేనట
- బీఆర్ఎస్ నెట్‌వర్క్ యూజింగ్‌లో బెస్ట్
- అసెంబ్లీ సమావేశాల్లో తేటతెల్లం
- పోస్టులు పెట్టడంలో ప్రతిపక్షం ఫాస్ట్
- బీజేపీ సైతం దూసుకెళ్తున్నట్లు స్పష్టం
- లోక్‌సభ ఎన్నికల్లోగా కాంగ్రెస్ పుంజుకుంటుందా?




**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణలో దాదాపుగా పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియాను ఎదుర్కొనేందుకు కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తంటాలు పడుతుంది. కాంగ్రెస్ పార్టీకి ఉన్న ఈ లోపాన్ని అసెంబ్లీ సమావేశాలు బయటపెట్టాయి. తమ పార్టీకి చెందిన లీడర్ ఓ స్టేట్‌మెంట్ ఇస్తే అది నిజమని నమ్మించేందుకు సోషల్ మీడియా చకచకా కొన్ని డాక్యుమెంట్లు చూపిస్తూ.. పోస్టులు పెట్టేస్తే.. వైరల్ చేస్తూ వచ్చింది బీఆర్ఎస్. అదే సమయంలో ప్రభుత్వం చెప్పే అంశాలు, నిజాలు, డాక్యుమెంట్లు ప్రజల్లోకి వెళ్లలేదు. దీనికి కారణం కాంగ్రెస్ సోషల్ మీడియా బలహీనంగా ఉండటమే. సోషల్ మీడియాలో కాంగ్రెస్ చాలాకాలంగా బలహీనంగానే ఉంది. జాతీయ స్థాయిలోనూ ఇదే పరిస్థితి. కేంద్రంలోని బీజేపీ సర్కార్ సోషల్ మీడియాలో తమ అభివృద్ధిని చూపుతుంటే కాంగ్రెస్ మాత్రం ఆ స్థాయిలో వైఫల్యాలను ఎత్తి చూపడం లేదు. ఇక తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడు అదే పరిస్థితి. బీఆర్ఎస్ ఓడిపోయినా సోషల్ మీడియాలో బలంగా ఉంది. కాంగ్రెస్ మాత్రం బలహీనంగా ఉంది. బీజేపీకి దీటుగా బీఆర్ఎస్ సోషల్ మీడియాను బలోపేతం చేశారు ఆపార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. రాజకీయాల్లో సోషల్ మీడియా ప్రభావం ఎలా ఉంటుందో బాగా తెలుసు. అందుకే ఆయన మొదటి నుంచి బీఆర్ఎస్ సోషల్ మీడియాను ఊహించని విధంగా బలపరుస్తూ వచ్చారు. దానిపై చాలా పెట్టుబడి పెట్టారు. దేశ విదేశాల్లో సోషల్ మీడియా సైన్యాన్ని సిద్ధం చేసుకున్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ ఓ అంశాన్ని ట్రెండ్ చేయాలనుకుంటే ఇట్టే చేస్తుంది. కేటీఆర్ ఐటీ మినిస్టర్ ఎపిసోడ్ దీనికి ఊదహరణ. అనుకుంటే తాము అనుకున్న టాపిక్ ను ఓ గంట అయినా ట్రెండింగ్ లో ఉంచగలరు.అధికారంలో ఉన్నప్పుడు వ్యవస్థకృతంగా తమ సోషల్ మీడియా సైన్యాన్ని బలపర్చుకోవడం వల్ల.. ఇప్పుడు విపక్షంలోకి పోయినా పెద్దగా నష్టం జరగడం లేదు. బీఆర్ఎస్ సోషల్ మీడియా ముందు తేలిపోతున్న కాంగ్రెస్ ఇప్పుడు పొలిటికల్ జనరేషన్ వేరుగా ఉంది. నేరుగా అసెంబ్లీ సమావేశాలు లైవ్ చూసి.. తమకు తాము ఏది మచో.. చెడో నిర్ణయించుకునే స్థితిలో మిలేనియల్స్ లేరు. పైగా వారికి చూసేంత తీరిక లేదు. నిజమో అబద్ధమో..సోషల్ మీడియాలో వచ్చేదే నమ్ముతున్నారు. అందుకే రాజకీయ పార్టీలు సోషల్ మీడియా సైన్యాలను పెంచుకుంటూ పోతున్నాయి. కానీ తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సోషల్ మీడియా వ్యవస్థ కనిపించడం లేదు. ఇదే అధికార పార్టీకి పెద్ద మైనస్‌గా మారింది.ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌పై కోపంతో కొంత మంది టీడీపీ సానుభూతిపరులు పని చేశారు. బీఆర్ఎస్‌తో వాదనలు పెట్టుకున్నారు. కానీ కాంగ్రెస్ వైపు నుంచి సరైన సోషల్ మీడియా పోరాటమే కనిపించలేదు. ఆ లోపం అధికారంలోకి వచ్చిన తరవాత ఇంకా కనిపిస్తోంది. అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ వాయిసే ఎక్కువగా వైరల్ అవుతోంది. కానీ కాంగ్రెస్ నేతలు చెబుతున్న విషయాలు మాత్రం వైరల్ కావడం లేదు.సోషల్ మీడియాను

మిగతా 2వ పేజీలో...

## లోక్‌సభ ఎన్నికలకు సిద్ధంకండి

బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపు



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** లోక్‌సభ ఎన్నికలకు సమాయత్తం కావాలని, అసెంబ్లీల వారీగా భేటీలు ఏర్పాటు చేసుకోవాలని పార్టీ నేతలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ ఆర్ ఆదేశించారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ నేతలతోసోమవారం కేటీఆర్ సమావేశమయ్యారు. జనవరి 26వ

మిగతా 2వ పేజీలో...

## సింగరేణి కార్మికుల కల నిజం చేస్తాం

- ఐఎన్‌టియుసిని ఆదరించండి
- కార్మికుల సమస్యలు పరిష్కరించుకోండి
- గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారంలో మంత్రి శ్రీధర్‌బాబు



**కమాన్‌పూర్, ప్రభాతసూర్యుడు :** సింగరేణి కార్మికుల సొంతింటి కలను నిజం చేసుకోవాలని ఈనెల 27 న జరిగే సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘమైన ఐఎన్టీయూసీని గెలిపించుకోవాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సింగరేణి ఎన్నికల ప్రచారంలో భాగంగా రామగుండం రీజియన్ సోమవారం ఆర్జీ 3 డివిజన్‌లోని

మిగతా 2వ పేజీలో...



## సీఎం రేవంత్ రెడ్డికి జ్వరం


మూడు రోజులుగా గొంతునొప్పి

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జ్వరం బారినపడ్డారు. జూబ్లీహిల్స్‌లోని రేవంత్ నివాసంలో ఆయనకు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించారు.

2లో

## కొడంగల్‌పై సీఎం నజర్

- ఒక జిల్లా పరిధిలోకి తీసుకొచ్చే ఆలోచన
- సాధ్యసాధ్యాలపై అధికారులకు మౌఖిక ఆదేశాలు



**కొడంగల్, ప్రభాత సూర్యుడు :** కొడంగల్ నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో మహబూబ్నగర్ జిల్లాలో కలిపేందుకు సాధ్యాసాధ్యాలపై కసరత్తు ప్రారంభమైందని తెలుస్తోంది. ఈ మేరకు అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. ప్రస్తుతం ఆ నియోజకవర్గంలోని కొన్ని మండలాలను నారాయణపేట జిల్లాలో, ఇంకొన్ని మండలాలను వికారాబాద్ జిల్లాలో కలిపారు. వీటిని ఈ రెండు జిల్లాల పరిధి నుంచి మినహాయించి మహబూబ్ నగర్ జిల్లాలోకి మార్చేందుకు అధికారులు

మిగతా 2వ పేజీలో...

## కంట్రోల్ తప్పితే కఠిన చర్యలు

- రైస్ మిల్లర్లకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరిక
- పౌర సరఫరా శాఖ 11వేల అప్పుల్లో ఉన్నట్లు వెల్లడి
- హుజూర్‌నగర్‌లో రేషన్ షాపు తనిఖీలో మంత్రి స్పష్టం

**సూర్యాపేట, ప్రభాతసూర్యుడు :** సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో రేషన్ షాపును పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పరిశీలించారు.తరువాత ఉత్తం మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉన్న నాయకులు అధికారుల అండదండలతో రేషన్ రీసైక్లింగ్ జరుగుతుంది. రేషన్ రైస్ ఎవరైనా సరే రీసైక్లింగ్ పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయి. రేషన్ బియ్యం చాలా వ్యయంతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. రేషన్‌మాఫియా చేస్తే ఈ ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకుంటుంది. సివిల్ సప్లై కార్పొరేషన్ టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి ఉన్నప్పుడుఅప్పు 3,300 కోట్లు. ప్రతి ఏటా రేషన్

మిగతా 2వ పేజీలో...





## మొద్దుకు వేలిముద్ర!

- రూ.500గ్యాస్‌కు సిద్ధమవుతున్న సర్కారు
- తెల్ల రేషన్‌కార్డుదారులకు అందించే యోచన
- బయోమెట్రిక్ విధానం అమలుపై సమాలోచన
- మార్గదర్శకాల రూపకల్పనపై తర్జనభర్జన
- కొత్త రేషన్‌కార్డుల జారీ, పథకం అమలుపై సందిగ్ధత

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో రూ.500కే గ్యాస్ సిలిండర్ ప్రధానమైనది. 'మహాలక్ష్మి పథకంలో భాగమైన సబ్సిడీ సిలిండర్ పంపిణీపై ఇప్పటికే పౌర సరఫరాల శాఖ కసరత్తు చేస్తోంది. తాజాగా లబ్ధిదారుల ఎంపికపై ఆ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందించినట్లు తెలుస్తోంది. దీని ప్రకారం రాష్ట్రంలో రేషన్ కార్డు ఉన్న వారికే ఈ పథకం వర్తింపచేసే అవకాశాలున్నట్లు సమాచారం. లబ్ధిదారుల

మిగతా 3వ పేజీలో...





# యాచారంలో ఘనంగా క్రీస్తు జన్మదిన వేడుకలు

**యాచారం - ప్రభాత సూర్యుడు :** యాచారం మండల పరిధిలోని పలు గ్రామాలలో ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. నంది వనపర్తి ఎంబి బేతేల్ చర్చిలో. ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, బిఎన్నార్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి శేఖర్ రెడ్డి, మూడేడ్ల వెంకట్ రెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏసుక్రీస్తు పుట్టినరోజు సందర్భంగా దైవ సేవకులకు సంఘస్తులకు శుభాకాంక్షలు తెలిపారు. దావీదు పట్టణమునందు నేడు రక్షకుడు జన్మించిన దినం. ఈయననే ప్రభువైన ఏసుక్రీస్తు. ఏసుప్రభువు క్షమా, కరుణ, దయ, ప్రేమ, త్యాగం, సహనం, మానవులందరికీ అవసరమని వాటిని ఆచరించాలని క్రీస్తు బోధించారు. ఏసుక్రీస్తు జీవితమే ఒక తార్కాణం. శాంతి కోసమే సిలువ ఎక్కారని అన్నారు. కార్యక్రమంలో స్థానిక పాస్టర్ మధుపాల్, కొంగరి జంగయ్య, నర్రె భాష, కొంగరి యాదగిరి, ఏంజాల్ అంజయ్య, నెర్రె శ్రీశైలం, సాహిద్, శివలింగ చారి, కొండాపురం శ్రీశైలం, జయరాజు, చందు, మూలి ఎలిషా, ఆనంద్, ప్రభాకర్, బాబర్, సంఘస్తులు తదితరులు పాల్గొన్నారు.



# ఉచిత కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**రంగాపూర్ సర్పంచ్ డబ్బికార్ మమత అజయ్ బాస్**

**మంచాల - ప్రభాత సూర్యుడు :** మంచాల మండల పరిధిలోని రంగాపూర్ గ్రామంలో మహిళలు ఉచిత కుట్టు మిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ డబ్బికార్ మమత అజయ్ బాస్ అన్నారు. అభయ ఫౌండేషన్ వారి సహకారంతో 40 మంది మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు స్వయంకృషితో ఎదగాలంటే ఉచిత కుట్టు మిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. కార్యక్రమంలో అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాలచంద్రసాగర్, మహిళలు పాల్గొన్నారు.



# ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**కుత్బుల్లాపూర్ - ప్రభాత సూర్యుడు :** ప్రపంచవ్యాప్తంగా వందల కోట్ల మంది ప్రజలు జరుపుకునే మతపరమైన సాంస్కృతిక పండుగ క్రిస్మస్ అని సోమవారం సుచిత్ర బ్రాంచ్ నారాయణ స్కూల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జే హేమలత అన్నారు. విద్యార్థులకు అన్ని మతాలు ఒక్కటే అని తెలియజేసే విధంగా పిల్లలకు అవగాహన కల్పించడానికి నారాయణ స్కూల్ ఎల్లవేళలా ముందుంటుందని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏటీఎం పురుషోత్తం రెడ్డి, పాఠశాల డీన్ సాయి ప్రకాష్, ఏవో చంద్రశేఖర్, పి ఈ టి ,వైస్ ప్రిన్సిపల్ , కోఆర్డినేటర్లు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు ,, విద్యార్థులు పాల్గొన్నారు.



# పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష

**ఇబ్రహీం పట్నం- ప్రభాత సూర్యుడు :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలో జరుగుతున్న పనులపై సోమవారం నాడు తొర్రూరు క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. పంచాయతీ రాజ్ అధికారులు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ అధికారులు గ్రామాలలో అభివృద్ధిపై దృష్టి సారించాలని, అభివృద్ధి చేసే పనులలో అధికారులకు పూర్తి సహకారం ఉంటుందని, ఈనెల 28 తేదీ నుండి ప్రజా పాలన కార్యక్రమం ప్రజలలోకి తీసుకుపోవాలని కోరారు.



# రామాలయానికి 2500 ఏళ్ల ఆయుష్షు!

- **ఎట్టి విపత్తు వచ్చినా తట్టుకునేలా నిర్మాణం**
- **అష్టభుజి ఆకారంలో గర్భగుడి**
- **దేశ సంస్కృతి ప్రతిబింబించే శైలి**
- **ఆర్కిటెక్ట్ అశీశ్ సోంపురా వెల్లడి**

**అయోధ్య, ప్రభాతసూర్యుడు :** దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రామ మందిరం ప్రారంభోత్సవానికి అయోధ్య సిద్ధమవుతున్నది. వచ్చే ఏడాది జనవరి 22న ఆలయంలో రాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరగనున్నది. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మితమవుతున్న ఈ ఆలయానికి ఎన్నో విశిష్టతలు, ప్రత్యేకతలు ఉన్నాయి. ఏ విధమైన విపత్తు వచ్చినా ఆలయం చెక్కు చెదరదట. ఎంత పెద్ద ప్రకృతి విపత్తు వచ్చినా 2,500 ఏండ్లు తట్టుకొని నిలబడేలా ఆలయాన్ని డిజైన్ చేసినట్టు ఆర్కిటెక్ట్ అశీశ్ సోంపురా తాజాగా తెలిపారు. ఆలయాన్ని దేశ సంస్కృతిని ప్రతిబింబించేలా నాగర శైలిలో నిర్మిస్తున్నారు. ఇక ముఖ్యమైన ఆలయ గర్భ గుడిని అష్టభుజి ఆకారంలో తీర్చిదిద్దుతున్నామని, గర్భ గుడి అష్టభుజి ఆకారంలో ఉన్న దేవాలయాలు తక్కువని సోంపురా వివరించారు. ఆలయ శిఖరం కూడా అష్టభుజి ఆకారంలో ఉంటుందని తెలిపారు. భక్తులకు సదుపాయాలపై మాట్లాడుతూ ప్రధాన ఆలయ సముదాయం వరకు వెళ్లే కారిడార్‌లో 35-40 వేల మంది వెళ్లే అవకాశం ఉందని, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఆలయ కాంప్లెక్స్ లోపల తక్కువ భవనాలు ఉంటాయని, మ్యూజియం, రిసెర్చ్ సెంటర్, ప్రార్థన మందిరం వంటి ఇతర సౌకర్యాలను బయట ఏర్పాటు చేయాలని అనుకొంటున్నామని చెప్పారు. రామ మందిర ప్రారంభోత్సవానికి గుర్తుగా నేపాల్ పలు ప్రత్యేక కానుకలను పంపనున్నదని స్థానిక మీడియా పేర్కొన్నది. ఇందులో వివిధ రకాల నగలు, సామగ్రి, బట్టలు, మిఠాయిలు ఉంటాయని మై రిపబ్లికా వార్తాపత్రిక తెలిపింది. వీటిని అందజేయడం కోసం జనక్‌పూర్‌ధామ్-అయోధ్యధామ్ ప్రయాణం జనవరి 18న ప్రారంభమవుతుందని, 20 నాటికి అయోధ్య చేరుకుంటుందని జానకి ఆలయ మహంత రామ్‌రోషణ్ దాస్ వైష్ణవ్ తెలిపారు. అదే రోజున కానుకలను రామ మందిర ట్రస్టుకు అందజేస్తామని పేర్కొన్నారు. గతంలో అయోధ్య ఆలయంలో ప్రతిష్ఠించే రాముడి విగ్రహాన్ని తయారు చేసేందుకు నేపాల్ కాళిగండకి నదీ తీరంలో సేకరించిన శాలిగ్రామ రాళ్లను అయోధ్యకు పంపిందని పత్రిక తెలిపింది. కాగా, ఆలయం ప్రారంభోత్సవం నేపథ్యంలో బీజేపీ ఎంపీ సుబ్రతా పాథక్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రామ భక్తులపై కాల్పులు జరిపించిన సమాజ్‌వాదీ పార్టీ నేతలకు ఆహ్వానాలు పంపొద్దని రామ మందిర్ ట్రస్టుకు లేఖ రాశారు.

# కొడంగల్‌పై సీఎం నజర్

మొదటిపేజీ తరువాయి..

కసరత్తు ప్రారంభించినట్టు తెలుస్తున్నది. ఇది సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కావడంతో ఈ అంశం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇతర జిల్లాల పరిధిలో ఉన్న మండలాలను ఒకే జిల్లా పరిధిలోకి తేవాలన్న ప్రతిపాదన పరిశీలనలో ఉంది. 2016 అక్టోబర్ 12న చిన్న జిల్లాలు ఏర్పడగా, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాను ఐదు జిల్లాలుగా విభజించారు. ఈ జిల్లా పరిధిలోని షాద్నగర్ నియోజకవర్గాన్ని పూర్తిగా పాలమూరు జిల్లా నుంచి విడదీసి రంగారెడ్డి జిల్లాలో కలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని కొన్ని మండలాలను నాగర్కర్నూల్ జిల్లా పరిధిలోకి తీసుకొచ్చి మిగతా మండలాలను రంగారెడ్డి జిల్లాలో కలిపారు. అంతేగాక కొన్ని నియోజకవర్గాల మండలాలను ఆయా జిల్లాల్లో కలపడంతో నియోజకవర్గ కేంద్రాలు ఒకవైపు, మండలాలు మరోవైపు అయ్యాయి. ప్రస్తుతం వీటిని సరిచేసే పనిలో పడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లా కావటంతో అధికారులు నియోజకవర్గ స్వరూపాన్ని జిల్లాల పరిధి నుంచి మార్చే దిశగా కసరత్తు చేస్తున్నారని సమాచారం. ఈ నేపథ్యంలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కొడంగల్ను మహబూబ్నగర్ జిల్లాలో కలిపేందుకు ప్రయత్నం చేస్తానన్నారు. గత ప్రభుత్వంలో కొడంగల్ను వికారాబాద్ జిల్లాలో కలిపారన్నారు గురునాథ్ రెడ్డి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి తన కోరికను తీర్చమని కోరుకుంటా అన్నారు.

# సింగరేణి కార్మికుల కల నిజం చేస్తాం

మొదటిపేజీ తరువాయి..

ఎఎల్పీ, ఓసీపీ2, ఓసీపీ1, గనుల పై ప్రచారంలో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సింగరేణి కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కార్మికుల సంక్షేమం కోసం కార్మికుల సమస్యల పై పోరాటం చేస్తుందని అన్నారు. సింగరేణి సంస్థ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కాటుపడి ఉందని పెండింగ్ ఉద్యోగా లను ఎటువంటి ఖర్చు లేకుండా ఇవ్వడం జరుగుతుందని అన్నారు.కాంగ్రెస్ పార్టీ తరపున మంథని నుండి పోటీ చేసిన తనకు ఓటువేసి గెలిపించినందుకు మంత్రి శ్రీధర్ బాబు సింగరేణి కార్మికులందరికీ కృతజ్ఞతలు తెలియజేశాడు. సింగరేణిలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ యూనియన్ ఐఎన్టీయూసీని గెలిపించాలని కోరుతూ మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు సొంత ఇంటి కల నిజం చేస్తామని అన్నారు. నూతన అండర్ గ్రౌండ్ బొగ్గు గనులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కొత్తగా ఉద్యోగంలో చేరిన కార్మికులకు ఒక సంవత్సర కాలంలో ఇంటర్నల్ ఉద్యోగాల నోటిఫికేషన్ వేస్తామని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఇన్కంటాక్స్ రద్దు చేస్తామన్నారు. డిపెండెంట్ మహిళ ఉద్యోగులకు చదువుకు తగిన విధంగా ఉద్యోగం ఇస్తామని, కార్మికుల కుటుంబాలకు కార్పొరేట్ వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. డిపెండెంట్ కార్మికులు డబ్బులు ఖర్చు లేకుండా ఉద్యోగాలు వచ్చే విధంగా కృషి చేస్తామని, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పై హైపవర్ కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు అండగా ఉంటుందని మీ సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని మంత్రి శ్రీధర్ బాబు సింగరేణి కార్మికులకు హామీ ఇచ్చారు. సింగరేణి ఎన్నికలలో ఐఎన్టీయూసీని గెలిపించాలని, ఈ నెల 27 తేదీన గడియారం గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో ఐఎన్టీయూసీ గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో భాగంగా ఐఎన్టీసీ అధ్యక్షుడు జనక్ ప్రసాద్, ఆర్జీ -3 ఉపాధ్యక్షుడు కోట రవీందర్ రెడ్డి, మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపత యాదవ్, ఐఎన్టీయూసీ నాయకులు, కాంగ్రెస్ నాయకులు గంట సత్యనారాయణ రెడ్డి కమాన్ పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వైనాల రాజు ఎంపీపీ ఆ రెల్లి దేవక్క కొమురయ్య గౌడ్ మాజీ జెడ్పిటిసి గంట వెంకటరమణారెడ్డి ఇనగంటి భాస్కరరావు వనం రామచంద్రరావు రొడ్డ బాపన్న ఉయ్యాల కుమారస్వామి మతిన్ ఖాన్ తెలుగు రాళ్ల ఇరుగు రాళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# కంట్రోల్ తప్పితే కఠిన చర్యలు

మొదటిపేజీ తరువాయి..

షాప్ కింద ప్రభుత్వం కొంత సబ్సిడీ అమౌంట్ ఇవ్వలేదు. రైతుల నుంచి పాడి ప్రో క్రూట్మెంట్ సెంట్రల్ గవర్నమెంట్ ఇవ్వక సివిల్ సప్లై కార్పొరేషన్ అప్పు 56 వేలకోట్లు. కార్పొరేషన్ ముందు ముందు నడపాలంటే ప్రమాదకరమైన పరిస్థితి ఏర్పడ్డది. ఏ సెక్యూరిటీ లేకుండా విలువైన పాడిని 22 వేల కోట్లు మిల్లర్ల దగ్గర సివిల్ సప్లై పెట్టిందని అన్నారు.అది కాకుండా కార్పొరేషన్ ఇప్పుడు 11వేల కోట్లు నష్టాల్లో ఉంది. గత టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి ఏటా సివిల్ సప్లై కార్పొరేషన్ కట్టాల్సింది మూడు వేల కోట్ల ఇంట్రెస్ట్. ఎంత ఆ సమర్థత రాజకీయదురుద్దేశంతో సివిల్ సప్లై కార్పొరేషన్ నడిపించారు. తెలంగాణ రాష్ట్రంలో స్టాక్ పెట్టుకోవడానికి స్థలం లేదు ఉన్న స్టాకు ఖరాబు అవుతుంది కర్ణాటక తమిళనాడు ప్రభుత్వాలు కొనుగోలు చేస్తాయి అంటే గతప్రభుత్వం అమ్మ లేదు. ఈ స్టాక్ లో కొంత కర్ణాటక తమిళనాడు ఇతర రాష్ట్రాలకు అమ్మడానికి పారదర్శకంగా చేస్తున్నాం. ఈ వ్యవస్థ మొత్తం టిఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్లలో వచ్చింది. రేషన్ బియ్యం పాడి ప్రొక్యూర్‌మెంట్ వ్యవస్థ అనేది సివిల్ సప్లై డిపార్ట్మెంట్లో ఉన్న విషయాలను వ్యవస్థను మెరుగుపరిచే విధంగా మా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. సివిల్ సప్లైలో ఉన్న సిస్టంను మొత్తం క్లీనప్ చేస్తామని అన్నారు.



# సీఎం రేవంత్ రెడ్డికి జ్వరం

**మూడు రోజులుగా గొంతునొప్పి**

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జ్వరం బారినపడ్డారు. జూబ్లీహిల్స్‌లోని రేవంత్ నివాసంలో ఆయనకు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించారు. గత మూడు రోజుల నుంచి జ్వరం, గొంతు నొప్పితో రేవంత్ బాధపడుతున్నట్లు సమాచారం. ఇంటి వద్దే ఫ్యామిలీ డాక్టర్ రేవంత్‌ను పరీక్షించి, మందులు సూచించినట్లు తెలుస్తోంది. ఆదివారం సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలోనూ రేవంత్ కొంత నీరసంగా కనిపించారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరమే రేవంత్ స్వల్ప అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది.

# లోక్‌సభ ఎన్నికలకు సిద్ధంకండి



మొదటిపేజీ తరువాయి..

తేదీలోగా సమావేశాలు పూర్తి చేసుకోవాలని కేటీఆర్ సూచించారు. అసెంబ్లీ ఎన్నికల ఓటమితో కుంగిపోవద్దని, పరాజయం చెందిన బీఆర్ఎస్అభ్యర్థులే నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లని, వారు ఆయా నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించాలని కేటీఆర్ స్పష్టం చేశారు.సమీక్ష అనంతరం చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి మాట్లాడుతూ తనను చేవెళ్ల ఎంపీఅభ్యర్థిగా పోటీ చేయమని కేటీఆర్ చెప్పారు. గెలుపే లక్ష్యంగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ ఖాళీ అవుతుందని కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలి. అసెంబ్లీ ఎన్నికల్లోబీఆర్ఎస్ ఓడిన స్థానాలపై ప్రత్యేక దృష్టి పెడుతాం అని రంజిత్ రెడ్డి పేర్కొన్నారు.

# కాంగ్రెస్ కొంచెమే..!

మొదటిపేజీ తరువాయి..

బలోపేతం చేసుకోవడం కాంగ్రెస్‌కు ముఖ్యం సోషల్ మీడియాలో ప్రచారాలకు నియంత్రణ లేదు. ఎక్కువ ఎవరు ఏది నమ్మితే అదే నిజం. అందుకే నిజాన్ని కూడా నమ్మించడానికి చాలా ప్రయత్నాలు చేయాలి. ప్రజలే తెలుసుకుంటారు అని నింపాదిగా ఉంటే.. అబద్ధమే నిజమవుతుంది. సోషల్ మీడియా ప్రభావం రాజకీయాల్లో పెరిగిన తర్వాత ఎన్నో ఇలాంటివి జరిగాయి. అందుకే ఇప్పుడు కాంగ్రెస్ సోషల్ మీడియా తన సోషల్ మీడియాను బలోపేతం చేసుకోవాలి.

# దళిత ప్రధాని !

మొదటిపేజీ తరువాయి..

తీసుకురావడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. 1998 నుంచి 2022 వరకు సోనియా గాంధీ, ఆమె కుమారుడు రాహుల్‌గాంధీ కాంగ్రెస్ అధినేతలుగా ఉన్నారు. కానీ వరుస వైఫల్యాలతో అనూహ్యంగా ఖర్గేను కాంగ్రె స్ పార్టీ జాతీయ అధ్యక్షుడిని చేసింది. తాజాగా ఆ పార్టీ దళిత ప్రధాని కార్డును ప్రయోగిస్తున్నట్టు తెలుస్తున్నది.సోనియా, రాహుల్‌గాంధీ నాయకత్వంలో వరుసగా రెండు పార్లమెంటు ఎన్నికల్లో (2014, 2019) కాంగ్రెస్ ఘోర పరాజయాలను చవిచూసింది. లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షంగా గుర్తింపు పొందాలంటే కనీసం 55 స్థానాలు అవసరం. ఈ రెండుసార్లూ కాంగ్రెస్ కేవలం 44, 52 సీట్లతో సరిపెట్టుకున్నది. గత పదేండ్లుగా భారత పార్లమెంటు దిగువ సభలో కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా దక్కకపోవడం ఆ పార్టీ కేంద్ర నాయకత్వ సామర్థ్యానికి నిదర్శనం. దేశ చరిత్రలో కాంగ్రెస్ పదేండ్లు అధికారంలో లేకపోవడం ఇదే మొదటిసారి.




# ఆర్టీసీ కార్గోలో ఫోన్లు మాయం

**మహబూబ్‌నగర్, ప్రభాతసూర్యుడు :** ఆర్టీసీ కార్గో పార్సిల్‌లో పంపిన ఫోన్లు మాయం మహబూబ్ నగర్ జిల్లాలో కలకలం సృష్టిస్తోంది. గడచిన కొన్ని నెలలుగా ఫోన్లు పంపేందుకు మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని మొబైల్ ఫోన్ డీలర్స్ అసోషియేషన్ ఆర్టీసి కార్గో సర్వీసును ఉపయోగించుకుంటున్నారు. ఉమ్మడి పాలమూరు వ్యాప్తంగా ఇక్కడి నుంచే వివిధ గ్రామాలకు, పట్టణాలకు సెల్ ఫోన్ల సేల్స్ నిర్వహిస్తున్నారు. అయితే మిగిలిన కొరియర్ సర్వీస్ లతో పోల్చితే ఆర్టీసి కనెక్టివిటీ బాగుంటుందని భావించారు. ఏ గ్రామం, పట్టణానికైన సులువుగా, వేగంగా ఫోన్లు పంపించవచ్చని గడచిన కొన్ని నెలలుగా ఆర్టీసి కార్గో సర్వీస్ మీద ఆధారపడ్డారు. అవసరం మేరకు వివిధ గ్రామాల్లోని మొబైల్ ఫోన్ల షాప్ లకు ఆర్డర్ మేరకు సరఫరా చేస్తున్నారు.అయితే ఎనిమిది నెలల క్రితమే మొబైల్ ఫోన్ల పార్సిల్ ఒకటి గమ్యానికి చేరలేదు. కొద్ది రోజులు వేచిచూసి ఆర్టీసి కార్గో సర్వీస్ నిర్వాహకులను ఆశ్రయించారు. వారి నుంచి నిర్లక్ష్యపు సమాధానం వచ్చిందని డీలర్లు తెలిపారు. దీంతో ఆర్టీసి పై అధికారులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై విచారణ చేసి పార్శిల్ అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎలాంటి స్పందన లేకపోవడంతో పోలీసులను సైతం ఆశ్రయించారు. పోలీస్ స్టేషన్లో అధికారుల హామీతో వెనక్కి తగ్గారు. కానీ ఇప్పటివరకు ఆ పార్శిల్ అడ్రస్ లేదని వాపోతున్నారు. అప్పటి నుంచి తరచూ పార్శిల్ లు గమ్యానికి చేరడం లేదని మహబూబ్ నగర్ మొబైల్ ఫోన్ డీలర్స్ అసోషియేషన్ ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ అధీనంలో ఆర్టీసి కార్గో సర్వీస్ ను ఆశ్రయిస్తే ఇలాంటి పరిణామాలు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. ఇటీవలే మూడు, నాలుగు పార్శిల్‌లు గమ్యం చేరలేదని ఎక్కడున్నాయో ఎవరు చెప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేస‌్తున్నరు. ఆర్టీసి పై అధికారులను ఆశ్రయిస్తే చర్యలు తీసుకుంటామని చెబుతున్న ముందడుగు పడడం లేదని చెబుతున్నారు. దీంతో మళ్లీ పోలీసులను ఆశ్రయించినట్లు వెల్లడించారు.తాము పంపుతున్న ఫోన్ల పార్శిల్ ల పై మొబైల్ పరికరాలు అని పేర్కొంటున్నారని? వాటి వల్ల తాము నష్టపోతున్నామని మొబైల్ ఫోన్ డీలర్స్ అసోషియేషన్ ప్రతినిధులు చెబుతున్నారు. ఫోన్ల విలువ వేల రూపాయిలు ఉంటే కార్గో సర్వీస్ పార్శిల్ పై వందల రూపాయల విలువ ఉంటుందని పేర్కొంటున్నారు. తాజాగా పంపిన పార్శిల్‌లు మిస్ అయ్యాయని చెబితే పార్శిల్ విలువ ఆధారంగా డబ్బులు చెల్లిస్తామని అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

# ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం : వీహెచ్

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**




రాష్ట్రంలో నూతన ప్రభుత్వం సోనియా గాంధీ ఇచ్చిన మాట మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లతో సమావేశమయ్యారు. రాష్ట్ర కాబినెట్ ఏక తాటిపైకి వచ్చి ఈ నెల 28న కాంగ్రెస్ ఫౌండేషన్ డేసందర్భంగా ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత వి హనుమంతరావు అన్నారు. తెలంగాణాలో గత ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. సోనియా గాంధీ ఇచ్చినమాట ప్రకారం రాష్ట్రంలో ఆరు గ్యారెంటీ స్కీమ్ లను రాష్ట్రంలో అమలుకు శ్రీకారం చూడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్యారెంటీ స్కీమ్ లను ప్రజలకు అందించడంలో ప్రధాన భూమికపోషించాలి.రాష్ట్రంలో ప్రజలకు పథకాలను అందించడంలో నాయకులు పాల్గొంటే మీ నాయకత్వం కూడా బలపడుతుందని అన్నారు. ఈ నెల 28 నుండి వచ్చే నెల 6 తేదీ వరకు ప్రజలకు అందుబాటులో ఉండి తెల్ల రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు ఆరు గ్యారెంటీ స్కీమ్ లను ప్రజలకు అందేలా చూడాలి. నిరక్ష్యరాస్యులైన ప్రజలకు ఆరుగ్యారెంటీ స్కీమ్ లను అందించేలా ప్రతి కార్యకర్త పాటుపడాలి. ప్రజలతో ఉంటే రాజకియంగా అగ్ర స్థానంలో ఉండే అవకాశాన్ని సధ్వినియోగం చేసుకోవాలి. క్రిస్మస్ పండుగ సందర్బంగా ముఖ్యమంత్రిఅందించిన క్రిస్మస్ కానుకలను ప్రజలకు అందించడంలో పార్టీ నాయకులు ముందుండాలి. రెజిలింగ్ క్రీడాకారిణి సాక్షి మాలిక్ తీసుకున్న నిర్ణయం చేసిన పోరాటం క్రీడా రంగంలో మహిళల అభ్యున్నతికిదోహదపడుతుందని అభినందించారు.

# భూపాలపల్లిలో కరోనా కలకలం

## ఒకే కుటుంబంలో ఐదుగురికి పాజిటివ్..!

**భూపాలపల్లి, ప్రభాత సూర్యుడు :** తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కరోనా కలకలం రేపుతోంది. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురికి కోవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయింది. మొదట పాజిటివ్ వచ్చిన మహిళ ఎంజీఎం ఆస్పత్రిలో కోవిడ్ వార్డులో చికిత్స పొందుతుంటే.. ఆమెతో ప్రైమరీ కాంటాక్టో ఉన్నవారికి కూడా కరోనా పాజిటివ్ రావడంతో హోమ్ ఐసోలేషన్ ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఘనపురం మండలం గాంధీనగర్కు చెందిన ఆగమ్మ అనే 60 ఏళ్ల మహిళకు నాలుగు రోజుల క్రితం కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. ఆమెకు ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఆ మహిళ కుటుంబ సభ్యుల నుంచి శాంపిల్స్ సేకరించి ఐఓఅలోని ల్యాబ్కు పంపారు. ఆ మహిళ కుటుంబ సభ్యులు నలుగురికి కూడా పాజిటివ్ అని తేలింది. దీంతో వారిని హోమ్ ఐసోలేషన్లోనే ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఇలా ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురికి కరోనా పాజిటివ్ రావడంతో ఊరంతా భయాందోళన చెందుతున్నారు. వారితో ప్రైమరీ కాంటాక్టో ఉన్న వారిలో కొత్త టెన్షన్ పట్టుకుంది. అయితే ఎలాంటి ప్రమాదం లేదని.. ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య సిబ్బంది భరోసా కల్పిస్తున్నారు.



# క్రీస్తు మార్గంలో ప్రశాంత జీవనం సాగించాలి

- క్రైస్తవ ప్రార్థన స్థలాల అభివృద్ధికి అవసరమైన చర్యలు
- మంథని యువతకు ఉపాధి కల్పనకు ప్రత్యేక ప్రణాళికలు
- క్రిస్మస్ వేడుకల్లో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు



**మంథని, ప్రభాతసూర్యుడు :** మానవాళి క్రైస్తు బోధనలైన శాంతి, ప్రేమ మార్గాలను పాటిస్తూ ప్రశాంతంగా జీవనం సాగించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం మంథని పట్టణంలోని బేతేలు గాస్పెల్ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రైస్తు జన్మదినం సందర్భంగా జిల్లాలో ఉన్న క్రైస్తవులందరికీ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఏసు ప్రభువు దీవెనలతో, క్రైస్తవుల సహకారంతో తనను మంథని ఎమ్మెల్యేగా మరోసారి గెలిపించారని, ఎన్నికల సమయంలో అనేకమంది పాస్టర్లు తనకోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారని,రాష్ట్రంలో సైతం ప్రజా ప్రభుత్వం వచ్చిందని, క్రైస్తవుల సంక్షేమానికి, అభివృద్ధికి కట్టుబడి ప్రభుత్వం పని చేస్తుందని, క్రైస్తవుల ప్రార్ధన స్థలాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటుందని అన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఆ ప్రభువు ఆశీస్సులతో విజయవంతంగా ప్రజలకు సుపరిపాలన అందిస్తుందని అన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకునే శక్తి ఆ ప్రభువు మాకు అందించేలా ప్రార్థించాలని మంత్రి పాస్టర్లను కోరారు. రాబోయే ఐదు సంవత్సరాల పాటు నాయకుడిగా కాకుండా సేవకుడిగా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సంక్షేమం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని మంత్రి అన్నారు. మంథని ప్రాంతంలో సైతం ఐటీ, ఇతర పరిశ్రమలను ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించేలా ప్రణాళికాబద్ధంగా తన శాయశక్తుల కృషి చేస్తానని మంత్రి అన్నారు. అనంతరం క్రిస్మస్ వేడుకలలో భాగంగా మంత్రి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పేద క్రైస్తవులకు ప్రభుత్వం తరపున అందించే క్రిస్మస్ గిఫ్ట్ ప్యాకెట్లను మంత్రి పంపిణీ చేశారు.

# అర్జీలు సరే అసలు కార్డులేవీ?

- గ్యారంటీ హామీల తీరుపై బీజేపీ ఎంపీ బండి ప్రశ్న
- కొత్త రేషన్ కార్డుల జారీపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీత
- 10 లక్షలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడి
- లక్షలాది మంది కార్డుల కోసం ఎదురుచూస్తున్నట్లు వ్యాఖ్యలు
- వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకుని ఘనంగా నివాళులు

**కరీంనగర్, ప్రభాతసూర్యుడు :** కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలోని ప్రధానమైన 6 హామీలను అమలు చేసేందుకు దరఖాస్తులను స్వీకరణకు రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించడాన్ని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ స్వాగతించారు. అయితే తెల్ల రేషన్ కార్డే అందుకు ప్రధాన అర్హతగా పేర్కొనడం పట్ల సందేహం వ్యక్తం చేశారు. “రాష్ట్రంలో గత పదేళ్లుగా ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. ఇప్పటికే 10 లక్షల కుటుంబాలు రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాయి. ఇంకా లక్షలాది కుటుంబాలు కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునేందుకు వేచి చూస్తున్నారు. వాళ్లందరికీ ఏ విధంగా న్యాయం చేస్తారు”అని ప్రశ్నించారు. తక్షణమే కొత్త రేషన్ కార్డుల మంజూరుకు దరఖాస్తులను ఆహ్వానించాలని కోరారు. దీంతోపాటు రాజకీయాలకు అతీతంగా నిజమైన లబ్దిదారులను గుర్తించి 6 పథకాలను అమలు చేసేందుకు అన్ని రాజకీయ పార్టీలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని సూచించారు. మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్ పేయి జయంతిని పురస్కరించుకుని జిల్లా పార్టీ కార్యాలయంలో “సుపరిపాలన దినోత్సవం” నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్ పేయి చిత్రపటానికి పూలమాల



వేసి నివాళులు అర్పించారు. వాజ్ పేయి దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 2 ఎంపీ సీట్లకే పరిమితమైన బీజేపీని ఆ తరువాత ప్రభుత్వంలోకి తీసుకొచ్చేందుకు అలుపెరగని పోరాటం చేసి మూడుసార్లు ప్రధాని పదవిని చేపట్టి అవినీతి మచ్చలేకుండా నిజాయితీగా, పారదర్శకంగా ప్రజారంజకంగా పాలించిన నేత వాజ్ పేయి. గాంధీజీ కలలు కన్న రామ రాజ్యం... గ్రామ స్వరాజ్య స్థాపన కోసం నిరంతరం పరితపించి అమలు చేసిన మహనీయుడు వాజ్ పేయి. గ్రామీణ సడక్ యోజనతో దేశంలోని అన్ని మారుమూల గ్రామాలకు రోడ్లు వేసిన ఘనత వాజ్ పేయిదే. స్వర్ణ చతుర్భుజీ పేరుతో 4 లేన్లు, 6 లేన్ల జాతీయ రహదారులను ఏర్పాటు చేసి ప్రజలకు రవాణా మార్గాలను సులభతరం చేసిన దూరదృష్టి కలిగిన నాయకుడు. ఇవే కాదు.. ఎయిర్, రైలు కనెక్టవిటీ విషయంలోనూ వాజ్ పేయి ముందుచూపు అందరికీ ఆదర్శనీయం. నిజం చెప్పాలంటే వాజ్‌పేయి నిజమైన వారసుడు మన ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్రమోదీ. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో 6 గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అందుకోసం దరఖాస్తులను ఆహ్వానించడాన్ని బీజేపీ పక్షాన స్వాగతిస్తున్నాం. ఎన్నికలు రాబోతున్నాయి. అంతలోపే లబ్దిదారులను గుర్తించాలి. ఎన్నికల సాకుతో బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా దరఖాస్తులకే పరిమితం కావొద్దని కోరతున్న. బీఆర్ఎస్ పార్టీ గతంలో నమ్మించి మోసం చేసింది. హామీలిచ్చి చేతులు దులుపుకోవడంవల్లే ఆ పార్టీని ప్రజలు తిరస్కరించారు. ఆ తప్పు కాంగ్రెస్ చేయొద్దని కోరుతున్నా. నిజమైన లబ్దిదారులను గుర్తించే విషయంలో రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలను, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని కోరుతున్నా.. అట్లాగే బీజేపీ కార్యకర్తలంతా అర్హులైన వారందరిని గుర్తించి దరఖాస్తు చేయించాలని కోరుతున్నా. అట్లాగే గత 10 ఏళ్లుగా ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. ఇప్పటికే 10 లక్షలకు పైగా కుటుంబాలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నాయి. ఇంకా దరఖాస్తు చేయని వారు లక్షల్లో ఉన్నారు. వారందరికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వడంతోపాటు 6 ప్రధాన హామీలకు సంబంధించి లబ్ది చేకూర్చేలా చేయాలని కోరుతున్నా తెలంగాణ ప్రభుత్వం 6 లక్షల 75 కోట్ల రూపాయల అప్పుల్లో మునిగి ఉంది. జీతాలివ్వలేని పరిస్థితుల్లో ఉంది. అయినా 6 గ్యారంటీలంటూ కాంగ్రెస్ హామీలిచ్చింది. అసలు అప్పులను ఎట్లా తీరుస్తారు? 6 గ్యారంటీల అమలుకు నిధులెక్కడి నుండి తీసుకొస్తారు? మీ ప్రణాళిక ఏమిటి? సంపదను ఏ విధంగా సృష్టిస్తారు? అప్పుల ఊబిలో చిక్కుకున్న తెలంగాణను ఎట్లా గట్టెక్కిస్తారో ప్రజలకు వివరించాలి? ఈ విషయంలో ప్రజల్లో అనేక సందేహాలున్నాయి? వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంది. ముస్లిం దేశాలే నిషేధించిన తబ్లిక్ జమాతే సంస్థ సమావేశాలకు ప్రభుత్వం నిధులెట్లా విడుదల చేస్తుంది? దీనివల్ల ముస్లిం పేద సమాజానికి ఏమైనా ఉపయోగం ఉందా? ఉగ్రవాదులను తయారు చేయడంతోపాటు బలవంతపు మతమార్పిళ్లకు పాల్పడే సంస్థ తబ్లిక్ జమాతే సంస్థకు నిధులివ్వడం వెనుక ఉద్దేశమేందో ప్రభుత్వం స్పష్టం చేయాలి.

# మొద్దుకు వేలిముద్ర!

మొదటిపేజీ తరువాయి..

బయోమెట్రిక్ తీసుకోవడం ద్వారా సిలిండర్లు దుర్వినియోగం కాకుండా ఉంటాయని ప్రతిపాదించినట్లు తెలిసింది. వంద రోజుల్లో 6 గ్యారెంటీలను అమలు చేస్తామన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ పథకానికి రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకోవాలని భావిస్తోంది. అయితే, రేషన్ కార్డులతో సంబంధం లేకుండా అర్హులను ఎంపిక చేయాలన్న ప్రతిపాదన ఉన్నప్పటికీ అది అమలు చేయాలంటే చాలా సమయం పడుతుందని, లబ్ధిదారుల ఎంపిక కష్టమవుతుందని యోచిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 1.20 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉండగా, రేషన్ కార్డుల సంఖ్య 89.98 లక్షలుగా ఉంది. ‘గివ్ ఇట్ అప్’లో భాగంగా 4.2 లక్షల మంది రాయితీ వదులుకున్నారు. వీరిని మినహాయిస్తే లబ్ధిదారుల సంఖ్య 85.79 లక్షలుగా ఉంది. అయితే, రేషన్ కార్డు డేటా బేస్‌తో మ్యాపింగ్ అయిన గ్యాస్ కనెక్షన్ల సంఖ్య 63.6 లక్షలుగా ఉంది. మరోవైపు, ‘ఉజ్వల’ గ్యాస్ కనెక్షన్లకు రూ.340 రాయితీ అందుతుండగా, మొత్తం కనెక్షన్లలో వీటి సంఖ్య 11.58 లక్షలు ఉంది. రాయితీ సిలిండర్లు ఏడాదికి ఆరు ఇవ్వాలా.? లేక పన్నెండా.? అనే దానిపై కూడా స్పష్టత రావాల్సి ఉంది. ఇందుకోసం అర్హులైన వారి కుటుంబంలో సభ్యుల సంఖ్య, గతేడాది వారు వాడిన సిలిండర్ల సంఖ్య వంటి వాటిని పరిగణలోకి తీసుకునే అవకాశం ఉంది. కాగా, రాష్ట్రంలో ప్రతినెలా సిలిండర్ రీఫిల్ చేసుకునే వారు 44 శాతం మంది మాత్రమే ఉన్నారు. కొత్తగా రేషన్ కార్డులు పొందే వారికీ ఈ పథకాన్ని వర్తింపచేయాలని, అయితే, కొత్తగా గ్యాస్ కనెక్షన్లు తీసుకున్న వారిని పరిగణలోకి తీసుకోవద్దని పౌర సరఫరాల శాఖ అధికారులు ప్రతిపాదించినట్లు తెలుస్తోంది.మరోవైపు,



రూ.500లకే గ్యాస్ సిలిండర్ పొందాలంటే ఈ కేవైసీ తప్పక చేయించుకోవాలన్న ప్రచారం జరగడంతో గ్యాస్ ఏజెన్సీలకు వినియోగదారులు పోటెత్తారు. అయితే, ఇప్పటివరకూ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని, ఈ కేవైసీ చేసిన వారికే రూ.500 గ్యాస్ సిలిండర్ అనేది అపోహ మాత్రమేనని ఎల్పీజీ డీలర్స్ అసోసియేషన్ స్పష్టం చేసింది. కేంద్రం సూచనల మేరకు నవంబర్ నుంచే రాష్ట్రంలో కేవైసీ పరిశీలన జరుగుతోందని స్పష్టం చేసింది. గ్యాస్ సిలిండర్ ఈ కేవైసీకి సంబంధించి ఆఫీసులకు గుంపులుగా వచ్చి ఇబ్బందులు పడొద్దని రాష్ట్ర ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి గతంలో ఓ ప్రకటన విడుదల చేశారు. డెలివరీ బాయ్స్ వద్దే ఈ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని స్పష్టం చేశారు. గ్యాస్ ఈ కేవైసీకి సంబంధించి కేంద్రం ఎలాంటి తుది గడువు నిర్ణయించలేదని, వీలైనంత త్వరగా వినియోగదారుల ఇంటి వద్దకే వెళ్లి కేవైసీ పూర్తి చేయాలని తమకు ఆదేశాలు అందినట్లు చెప్పారు. డెలివరీ బాయ్స్ వద్ద ఉన్న స్మార్ట్ ఫోన్లలో ప్రత్యేక యాప్ ద్వారా కేవైసీ ప్రక్రియ పూర్తి చెయ్యొచ్చని స్పష్టం చేశారు. ఒకవేళ బాయ్స్ వద్ద ఎవరిదైనా పూర్తి కాకపోతే, అలాంటి వారు మాత్రమే ఏజెన్సీ ఆఫీసులకు వెళ్లాలని తెలిపారు.

# పల్లవి ప్రశాంత్ కేసులో మరో ముగ్గురు అరెస్టు

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** బిగ్‌బాస్ ఫినాలే ఆదివారం రాత్రి హైదరాబాద్లోని అన్నపూర్ణ స్టూడియోస్ వద్ద ఘర్షణ వాతావరణం నెలకుంది. స్టూడియోస్ వద్దకు భారీగా చేరుకున్న పల్లవి ప్రశాంత్, అమర్దీప్ అభిమానులు తొలుత వాగ్వాదానికి దిగారు. టైటిల్ విజేతగా ప్రశాంత్ను ప్రకటించిన తర్వాత ఏకంగా కొట్లాటకు దిగారు. ఈ క్రమంలో కొందరు అమర్దీప్, అశ్వినీ, బిగ్ బాస్ బజ్ హోస్ట్ గీతు రాయల్ కార్లను ధ్వంసం చేశారు. బిగ్ బాస్ సీజన్ 7 ఫినాలే సంధర్భంగా అన్నపూర్ణ స్టూడియో సమీపంలో జరిగిన ప్రభుత్వ, ప్రవేట్ ఆస్తుల ధ్వంసం, అల్లర్ల కేసులో మరో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. యూసుఫ్గూడకు చెందిన సుధాకర్, పవన్, సరూర్నగర్కు చెందిన అవినాష్రెడ్డి అనే విద్యార్థిని జూబ్లీహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ బయట జరిగిన విధ్వంసం, దాడి ఘటనలో రెండు కేసులు నమోదయ్యాయి. ఇప్పటి వరకు 24 మందిని పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు పల్లవి ప్రశాంత్కు నాంపల్లి కోర్టు రెండు రోజుల క్రితం బెయిల్ మంజూరు చేసింది. ప్రతి ఆదివారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్కు హాజరై సంతకం చేయాలని కోర్టు ఆదేశించింది. కొన్ని రోజుల పాటు ఇంటర్వ్యూలు ఇవ్వొద్దని సూచించింది. బెయిల్‌పై బయటకు వచ్చిన ప్రశాంత్ తాజాగా తన తోటి కంటెస్టెంట్స్ శివాజీ, యావర్, భోలేలను కలిశాడు.



# మేడారంలో రద్దీ

- మూడు రోజుల సెలవులతో ప్రజలు జాతర దారి
- భారీగా తరలివచ్చిన భక్తులు.. తల్లులకు మొక్కులు

**ములుగు, ప్రభాతసూర్యుడు :**
2024 మేడారం మహాజాతరకు ఇంకా రెండు నెలల సమయం ఉంది. ఫిబ్రవరి 21 నుంచి 24వ తేదీ వరకు మహాజాతర తేదీలను ఖరారు చేశారు. కానీ భక్తజనం మాత్రం ముందే లక్షలాదిగా మేడారంకు తరలి వస్తున్నారు. మూడు రోజులు వరుసగా సెలవుదినాలు రావడంతో లక్షల సంఖ్యలో భక్తులు మేడారంకు క్యూ కట్టారు. సమ్మక్క-సారక్క దేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిన్న ఆదివారం ఒక్కరోజే సుమారు రెండు లక్షల మంది భక్తులు మేడారం సమ్మక్క సారక్క దేవతలను దర్శించుకున్నారు. ఏపీ, తెలంగాణ, ఛత్తీస్గఢ్, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు తరలివచ్చి సమ్మక్క-సారక్క దేవతలు దర్శించుకుంటున్నారు. సమ్మక్క-సారక్క దేవతలకు ప్రీతికరమైన నిలువెత్తు బెల్లం మొక్కులు సమర్పిస్తున్నారు. రోజుకు లక్షకు పైగానే భక్తులు సమ్మక్క సారక్క దేవతలు దర్శించుకోవడం చర్చగా మారింది. జాతరకి ఇంకా రెండు నెలల సమయం ఉన్నప్పటికీ భక్తులు ఇంత పెద్ద సంఖ్యలో ముందే ఎందుకు తరలివస్తున్నారని చర్చ జరుగుతుంది. అయితే జాతర సమయం వరకు మళ్లీ కరోనా కేసులు పెరిగిపోతే రావడం ఇబ్బందికరంగా ఉంటుందని అందుకే ముందస్తుగా వచ్చి సమ్మక్క సారక్క దేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్నామని కొందరు స్థానికులు అంటున్నారు. మరికొందరు స్థానికులు మాత్రం జాతర సమయంలో లక్షలాది మంది భక్తులతో కిక్కిరిసిపోయి ఉంటుంది. జాతర సమయంలో తోపులాటలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుంది. కాబట్టి కుటుంబ సమేతంగా ఆ సమయంలో దర్శనం చేసుకోవడం ఇబ్బందికరంగా ఉంటుందని అందుకే ముందే వచ్చి కుటుంబ సమేతంగా మొక్కులు చెల్లించుకుంటున్నామని అంటున్నారు. సమ్మక్క సారక్క దేవతలకు ప్రీతికరమైన బెల్లం మొక్కులు సమర్పించడం తో పాటు కోళ్లు, మేకలను మొక్కులు చెల్లించుకుంటున్నారు. అయితే జాతరకు ముందుగానే భక్తుల తాకిడి విపరీతంగా పెరిగిపోవడంతో అధికార యంత్రాంగం కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. జాతరకు వచ్చే నాలుగు ప్రధాన రహదారులలో ప్రత్యేకంగా పార్కింగ్కు కూడా ఏర్పాటు చేశారు. స్థానిక మంత్రి సీతక్క కూడా మేడారంలో పర్యటించారు. జాతర అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. నార్లాపూర్ నుండి వచ్చే రహదారి మొత్తం పాడైపోవడంతో వెంటనే మరమ్మతులు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అక్కడి నుంచి నేరుగా చిలకలగుట్ట వైపు వెళ్లిన సీతక్క ఆ మార్గంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. పనుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సహించే ప్రసక్తి లేదని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాతరను అన్ని శాఖలు సమన్వయంతో సక్సెస్ చేయాలని సూచించారు.



## వన దేవతలను దర్శించుకున్న మంత్రి సీతక్క

**ములుగు, ప్రభాతసూర్యుడు :**
మేడారం సమ్మక్క సారలమ్మ వన దేవతలను పంచాయితీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ దనసరి అనసూయ సీతక్క సోమవారం దర్శించుకున్నారు. ముందుగా పసరలోని గుండ్ల వాగు బ్రిడ్జిని, దయ్యాలవాగు సమీపంలో ఉన్న రోడ్డును చింతల్ క్రాస్ వద్ద రోడ్డు, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. అదే విధంగా చిలుకల గుట్ట, వీఐపీ పార్కింగ్ బస్ స్టాండ్ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఏర్పాట్లు చెయ్యాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి జాతర పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ములుగు ఎస్పీ గౌస్ ఆలం, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ, డీఎస్పీ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీలో ఇంచార్జీల టెన్షన్

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**
భారతీయ జనతా పార్టీలో ఏ రాష్ట్రానికి లేనంత మంది ఇంఛార్జ్లు తెలంగాణకు ఉన్నారు. ఇద్దరు జాతీయ ప్రధాన కార్యదర్శులు ఇంఛార్జ్లుగా ఉన్నారు. అయిన తెలంగాణలో ఆ పార్టీ ఆశించిన ఫలితాలు రాబట్టలేకపోయింది. ఎక్కువ మంది ఇంఛార్జ్లు ఉండడం సమన్వయం లేకపోవడంతో పార్టీపై ప్రభావం పడ్డదని పార్టీ వర్గాలే భావిస్తున్నాయి. ఇప్పటికైనా ఎవరో ఒకరినే ఇంఛార్జ్గా పెడితే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం అవుతుంది.ప్రస్తుతం బీజేపీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్లుగా ఇద్దరు జాతీయ ప్రధాన కార్యదర్శులు ఉన్నారు. సునీల్ బన్సల్, తరుణ్ చుగ్ రాష్ట్ర పార్టీ వ్యవహారాలు చూస్తున్నారు. అంతేకాదు రాష్ట్ర వ్యవహారాల సహా ఇంఛార్జ్గా జాతీయ కార్యదర్శి అరవింద్ మీనన్ ఉన్నారు. జాతీయ సంస్థాగత సహా ప్రధాన కార్యదర్శి శివ ప్రకాష్ ఎలాగూ ఉన్నారు. ఇక అసెంబ్లీ ఎన్నికల ఇంఛార్జ్గా ప్రకాష్ జవదేకర్ను ఆ పార్టీ నియమించింది. తెలంగాణ రాష్ట్రంపైన ప్రత్యేక దృష్టి పెట్టిన బీజేపీ హై కమాండ్ ఎక్కువ మంది నీ ఈ రాష్ట్రానికి పంపించింది. ఏ రాష్ట్రానికి లేనంత మందిని ఇక్కడ ఇంఛార్జ్లుగా పెట్టింది. అయితే వారి మధ్య సమన్వయం లేకనో, వారు రాష్ట్ర నేతలను సమన్వయం చేయలేకనో అనుకున్న ఫలితాలు సాధించలేక పోయింది బీజేపీ.తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. పార్లమెంట్ ఎన్నికలకు ఆ పార్టీ సమాయత్తం అవుతుంది. సునీల్ బన్సల్, తరుణ్చుగ్లు రాష్ట్రానికి వస్తున్నారు. సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇంకా వాళ్ళే ఉంటారా.. పార్లమెంట్ ఎన్నికల



వరకు వారే కొనసాగుతారా అనే చర్చ పార్టీలో కొనసాగుతోంది. బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు జాతీయ కమిటీలో మార్పులు చేర్పులు చేశారు. కొద్ది మందిని తప్పించి కొత్త వారిని తీసుకున్నారు. అయితే రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్లుగా ఉన్నవారు జాతీయ కమిటీలో అదే స్థానాల్లో కొనసాగుతున్నారు. జేపీ నడ్డా కొత్తగా తీసుకున్న వారికి బాధ్యతలు అప్పగించాల్సి ఉంది. ఎక్కడ అయితే రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్లు లేరో అక్కడ కొత్త వారిని నియమిస్తారా.. లేక పూర్తి స్థాయిలో మార్పులు చేర్పులు చేస్తారా అనే చర్చ జరుగుతుంది. అయితే రాష్ట్రానికి మాత్రం ఎవరినో ఒకరిని మాత్రమే పెడితే బాగుంటుంది అనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. తెలంగాణ పెద్ద రాష్ట్రం ఏమీ కాదని అంత మంది అవసరం లేదని పార్టీ శ్రేణులు అంటున్నాయి. అసలు పని జరగదని, బాధ్యతగా పని చేయరని అంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అది కనిపించిందని పార్టీ నేతలు అంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జాతీయ పార్టీ ఎన్నికల ఇంఛార్జ్ని నియమించే అవకాశం ఉందని పార్టీ వర్గాల సమాచారం.



# ఐఎన్టీయూసీకే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం మద్దతు

**కమాన్పూర్, ప్రభాతసూర్యుడు :** సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఐఎన్టీయూసీకే మద్దతు ఇవ్వడం జరుగుతుందని కేంద్ర కమిటీ సభ్యులు శ్రీనివాస్ బత్తుల శంకర్ బొక్కల శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆర్జీ 3 ఓసిపి వన్ బేస్ వర్క్ షాప్ లో ఐఎన్టీయూసీ సమావేశం జరిగింది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తోపాటు ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి జనక్ ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల నాయకులు ఇరుగు రాళ్ల శ్రీనివాస్ బొక్కల శ్రీనివాస్ బత్తుల శంకర్లు శ్రీధర్ బాబును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం ఐఎన్టీయూసీకి పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తుందని వారు శ్రీధర్ బాబుకు తెలిపారు. ఈ ఎన్నికల్లో ఐఎన్టీయూసీ ఘన విజయం సాధిస్తుందని తెలిపారు. శ్రీధర్ బాబు మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని, వారి సొంతింటి కలలను నిజం చేస్తామని అన్నారు. ఐఎన్టీయూసీని గెలిపించాలని కోరారు. అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్, దాని అనుబంధ సంఘాలు ఎప్పుడూ అండగా ఉంటాయన్నారు.ఐఎన్టీయూసీ ఆర్ జి త్రీ ఉపాధ్యక్షుడు కోట రవీందర్ రెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ ఐఎన్టీయూసీ నాయకుడు శ్రీనివాస రావు గట్టయ్య పివి గౌడ్ పిన్నింటి రాంరెడ్డి కమాన్ పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడువైనాల రాజు శివ శంకరయ్య మాతంగి సదానందం ఇరుగు రాళ్ల కుమార్ తో పాటు కాంగ్రెస్ నాయకులు ఐఎన్టిసి నాయకులు పాల్గొన్నారు.



# వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి

- ఐదుగురు ఒకే కుటుంబానికి చెందిన వారు
- మొదటి ప్రమాదంతో బయల్దేరిన కుటుంబసభ్యుల్లో నలుగురు దుర్మరణం

**నల్లగొండ, ప్రభాత సూర్యుడు :**
నల్లగొండ జిల్లాలో రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు మృతిచెందారు. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో నిడమనూరు మండలంలో వెంపాడు స్టేజి వద్ద నడుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఓ బైకు ఢీకొట్టింది. దీంతో బైకర్ కేశవులుతోపాటు పాదచారి సైదులు మృతిచెందారు. కేశవులు మరణవార్త తెలుసుకున్న అతని కుటుంబ సభ్యులు పెద్దవూర మండలం మల్లెవాని కుంట తండా నుంచి ఆటోలో ప్రమాద స్థలికి బయల్దేరారు. ఈ క్రమంలో పార్వతీపురం వద్ద వారి ఆటోను ట్యాంకర్ ఢీకొట్టింది.దీంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురు మరణించారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరు దవాఖానలో చికిత్స పొందుతూ మరణించారని తెలిపారు. గాయపడిన వ్యక్తి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. మృతులను గుణ్య, నాగరాజు, పాండ్య, బుజ్జిగా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా, ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు చనిపోవడంతో మల్లెవానికుంటలో విషాదఛాయలు అలముకున్నాయి.



# దంతెవాడలో ఎన్కౌంటర్

ముగ్గురు మావోయిస్టులు హతం
దంతెవాడ, ప్రభాతసూర్యుడు :
మన్యంలో మరోసారి ఎన్కౌంటర్ జరిగింది. ఛత్తీస్గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లాలో జరిగిన ఈ ఎన్కౌంటర్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. దంతెవాడ జిల్లాలో మావోయిస్టుల కదలికలు ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు, ఆర్మీ జవాన్లు కలిసి సంయుక్తంగా కూంబింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా భద్రతాసిబ్బందికి మావోయిస్టులు ఎదురుపడటంతో కాల్పులు చోటుచేసుకున్నాయి. దంతెవాడ-సుక్మా జిల్లాల సరిహద్దులోని తుమక్పాల్- దబ్బాకున్నా గ్రామాల మధ్య ఈ ఎన్కౌంటర్ చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కాటే కళ్యాణ్ పోలీస్ స్టేషన్ పరిధిలోగల దబ్బాకున్నా గ్రామ శివార్లలోని కొండపై ఉన్న మావోయిస్టులను ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు భద్రతా సిబ్బంది చుట్టుముట్టడంతో ఎన్కౌంటర్ చోటుచేసుకుందని, బస్తర్ రేంజ్ ఐజీపీ సుందర్రాజ్ చెప్పారు. ఘటనా స్థలంలో భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి లభ్యమైనట్లు తెలిపారు.

# కాటేదాన్లో రోడ్డు ప్రమాదం

**రంగారెడ్డి, ప్రభాతసూర్యుడు :**
హైదరాబాద్ నగర శివారు కాటేదాన్ లో రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన కారు అదుపు తప్పి ధి వైడర్ ను ఢీ కొట్టి రోడ్డు పై పల్టీలు కొట్టింది. ఘటనలో కారు లో ప్రయాణిస్తున్న ఒకరు మృతి చెందగా మరో ముగ్గురుకి తీవ్ర గాయాలు అయ్యాయి. సీట్ బెల్ట్ పెట్టుకున్నందుకు డ్రైవర్ సురక్షితంగా బయట పడ్డాడు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. శంషాబాద్ నుండి డబిరిపూరా వెళ్తుండగా ప్రమాదం జరిగింది. కుక్కను తప్పించబోయి కారు ప్రమాదానికి గురైందని సమాచారం.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215